VEGA JEWELLERS
దివిలోనైనా... భువిలోనైనా.. వేగ తోడుంటే
వివాహం వైభోగం అవుతుంది.
ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | USA
follow us vegajewellers

కలం కౌంటర్
KALAM COUNTER TELUGU DAILY
తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 109
పేజీలు : 4 వెల రూ.4/-
Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor
గురువారం 4 సెప్టెంబరు 2025

# బలహీనంగా ఉన్న స్థానిక సంస్థలకు ఊతమిస్తాం

● ఆదాయార్జన ఆధారంగా పంచాయతీల కేటగిరీ ● ఆర్థిక వనరులు పెంచుకునేలా ప్రత్యేక కార్యాచరణ ● 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం సమావేశంలో సీఎం చంద్రబాబు ● పంచాయతీ రికార్డుల ఆన్‌లైన్‌కు డిప్యూటీ సీఎం సూచన ● 2025-29 కాలానికి రాష్ట్ర ఆర్థిక సంఘం సిఫార్సులు




**అమరావతి,కలంకౌంటర్ :** స్థానిక సంస్థల బలోపేతానికి కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ఆర్థిక సాయంతో పాటు సొంత ఆదాయ వనరులు పెంచుకోవడం ద్వారా వేగంగా అభివృద్ధి సాధించడంపై అధికారులు దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. వెనకబడిన, తలసరి ఆదాయం తక్కువ ఉన్న స్థానిక సంస్థలను కేటగిరీలుగా విభజించాలని ఆదేశించారు. దీంతో వాటికి ప్రత్యేక సాయం అందించే వీలు కలుగుతుందన్నారు. స్థానిక సంస్థల వర్గీకరణ ప్రక్రియను నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. ఇందుకు అవసరమైన చట్టసవరణ చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. బుధవారం సచివాలయంలో 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆర్థిక సంఘం సిఫారుసులను సీఎంకు అందజేశారు. స్థానిక సంస్థల బలోపేతానికి ఆర్థిక–ఆర్థికేతర అంశాలపై ఆర్థిక సంఘం సిఫార్సులు చేసింది.

**స్థానిక సంస్థల స్వయం సమృద్ధే లక్ష్యంగా..** ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... 'పంచాయతీల అభివృద్ధికి ఏటా నరేగా సహా వివిధ రూపాల్లో సమకూరుతున్న నిధుల మొత్తాన్ని క్రోడీకరించాలి. పంచాయతీల నిర్వహణకు ఏ మేరకు అవసరాలు ఉన్నాయో గుర్తించాలి. ఈ ప్రక్రియను పూర్తి చేస్తే ఏ విధంగా సాయం అందించాలి...? స్థానిక సంస్థల్ని ఏ విధంగా బలోపేతం చేయాలి...? అనే అంశాలపై విధి విధానాలు రూపొందించడానికి వీలు కలుగుతుంది. ఉపాధి హామీ పథకం కింద పెద్ద ఎత్తున కేంద్రం నుంచి నిధులు వస్తున్నాయి. అయితే ఆ మేరకు ఆస్తుల కల్పన జరుగుతుందో, లేదో అనే విషయాన్ని నిరంతరం పరిశీలించుకోవాలి. స్థానిక సంస్థలు స్వయం సమృద్ధి సాధించేలా అధికారులు ప్రయత్నించాలి. ఇదే విధంగా పట్టణ స్థానిక సంస్థలనూ ఆర్థికంగా బలోపేతం చేస్తూ, మరిన్ని ఆదాయార్జన మార్గాలను అన్వేషించాలి. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఫైనాన్స్ కమిషన్ నిధులతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం కూడా మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చే నిధులను కొంత మేర పెంచితే వాటిని స్థానిక సంస్థలు సద్వినియోగం చేసుకోవాల్సి ఉంటుంది. అలాగే, వనరులు తక్కువగా ఉండి... సామాజికంగా వెనకబడి ఉన్న స్థానిక సంస్థల్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పైన ఉంది. ఇదే సమయంలో స్థానిక సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించేలా అవగాహన కల్పించాలి. నిధులు తీసుకోవడంతో పాటు, వాటిని సద్వినియోగం చేసుకునేలా స్థానిక ప్రజాప్రతినిధులు వ్యవహరించాలి. ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించేది స్థానిక సంస్థలు. దీనిని దృష్టిలో పెట్టుకుని స్థానిక సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు విధులు నిర్వర్తించాలి. స్థానిక సంస్థల్లో విధులు నిర్వహించే వారు సమర్థవంతంగా

- 2లో

# దుష్ప్రచారం చేస్తున్నవారిని ప్రజలు క్షమించరు

● గ్రాఫిక్స్ అంటున్న వారు క్షేత్రస్థాయికి వచ్చి చూడాలి ● మార్చి నెలాఖరుకు అధికారులు, ఉద్యోగులకు భవనాలు సిద్ధం చేస్తాం - మంత్రి నారాయణ




**అమరావతి,కలంకౌంటర్ :** అమరావతి అత్యంత సురక్షితమైన రాజధాని అని మరోసారి స్పష్టం చేసారు మంత్రి నారాయణ..కొంతమంది పనిగట్టుకుని మరీ అమరావతిపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.అసలు అమరావతిలో ఎలాంటి పనులేమీ జరగడం లేదని గ్రాఫిక్స్ మాత్రం చూపిస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్న వారిని ప్రజలు క్షమించరని అన్నారు...ఇలా ప్రచారం చేస్తున్న వారు క్షేత్ర స్థాయికి వచ్చి పరిస్థితిని చూడాలని హితవు పలికారు...రాజధానిలోని నేలపాడులో నిర్మాణంలో ఉన్న గెజిటెడ్ ఆఫీసర్స్ టైప్ -1,టైప్ -2 భవనాలతో పాటు గ్రూప్ - డి ఉద్యోగుల భవనాలను మంత్రి నారాయణ పరిశీలించారు.. ప్రస్తుతం పనులు ఏ దశలో ఉన్నాయి...ఎప్పటి వరకూ పూర్తవుతాయి.. .భవనాలతో పాటు ఇతర మౌళిక వసతుల కల్పన ఎప్పటికి పూర్తవుతుందనే వివరాలను సీఆర్డీఏ ఇంజినీరింగ్ అధికారులను,కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు...ఆ తర్వాత మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడారు. అమరావతి పనుల్లో ప్రస్తుతం 13వేల మంది ఉద్యోగులు,కార్మికులు నిరంతరం పనిచేస్తున్నారు...అలాగే ప్రొక్లెయిన్ లు,జేసీబీలు,ఇతర యంత్రాలు సుమారు 2500 వరకూ పనిచేస్తున్నాయి...వర్షాలు కూడా తగ్గడంతో పనులు తిరిగి ఊపందుకున్నాయని మంత్రి

- 2లో

# ఇంటి ముంగిటకే చేనేత వస్త్రాలు

● ఈ కామర్స్ లోకి అడుగుపెట్టిన ఆప్కో ● అమెజాన్, ఫ్లిప్ కార్ట్, జియో మార్ట్ సంస్థలతో అనుసంధానం ● సంప్రదాయ వస్త్రాలతో పాటు రెడీమేడ్ చేనేత దుస్తుల అమ్మకం ● నేరుగా వినియోగదారుల ఇళ్లకే డోర్ డెలివరీ ● యువతకు ఆకట్టుకునేలా రెడీమేడ్ చేనేత దుస్తులు ● రోజు రోజుకూ పెరుగుతున్న చేనేత వస్త్రాల వినియోగం ● నేతన్నలకు 365 రోజుల ఉపాధే లక్ష్యం : మంత్రి సవిత




**అమరావతి,కలంకౌంటర్ :** సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రాకతో చేనేతకు మహర్దశ ప్రారంభమైంది. నేతన్నల అభివృద్ధికి ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, మరోవైపు చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ ప్రభుత్వం సదుపాయం కల్పిస్తోంది. రాష్ట్రంలోనూ, జాతీయ స్థాయిలోనూ చేనేత బజార్లు ఏర్పాటు చేయిస్తోంది. అదే సమయంలో ఆప్కో ద్వారా అమ్మకాలు పెంచేలా చర్యలు చేపట్టింది. వినియోగదారులకు చేనేత దుస్తులను మరింత చేరువ చేయడానికి ఆప్కో ద్వారా డోర్ డెలివరీ సదుపాయం కల్పించింది. అమెజాన్, ఫ్లిప్ కార్ట్ వంటి ఈ కామర్స్ సంస్థల ద్వారా అమ్మకాలు ప్రారంభించింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా 40 ఆప్కో షోరూమ్ లను సిద్ధం చేసింది. నేటితరం అభిరుచులకు అనుగుణంగా ప్రపంచ ప్రఖ్యాతగాంచిన పోచంపల్లి, ధర్మవరం, మంగళగిరి పట్టు చీరలతో పాటు రెడీమేడ్ దుస్తులను కూడా ఆప్కో షో రూమ్ లతో పాటు ఆన్ లైన్ లోనూ ప్రభుత్వం అమ్మకానికి పెట్టింది. యువత, మహిళ, చిన్న పిల్లలు... ఇలా వర్గాల వారిని ఆకట్టుకునేలా

- 2లో

# ప్రాణత్యాగం చేసి కోట్లాది మంది తెలుగు వారికి దారిచూపిన వ్యక్తి పొట్టి శ్రీరాములు

● పొట్టి శ్రీరాములు స్మృతివనం ఏర్పాటుకు అన్ని విధాల సహకరిస్తాం ● విగ్రహం ఏర్పాటు కేవలం కమిట్ మెంట్ మాత్రమే కాదు.. నాకో ఎమోషన్! ● ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని అనుకున్నది సాధించాలి ● అమరావతిలో పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం, స్మృతివనం, ఆడిటోరియం నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి నారా లోకేష్





**అమరావతి,కలంకౌంటర్:** ప్రాణత్యాగం చేసి కోట్లాది మంది తెలుగువారి దారిచూపిన వ్యక్తి పొట్టి శ్రీరాములు గారని, పొట్టి శ్రీరాములు గారి స్మృతివనం ఏర్పాటుకు అన్ని విధాల సహకారం అందిస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం, అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో అమరావతిలోని తుళ్లూరు–పెదపరిమి మధ్య ప్రభుత్వం కేటాయించిన 6.8 ఎకరాల విస్తీర్ణంలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహంతో పాటు ఆడిటోరియం, స్మృతివనం నిర్మాణానికి మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేశారు. పొట్టి శ్రీరాములు గారిపై రూపొందించిన ఏవీని వీక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మంత్రి లోకేష్ ప్రసంగిస్తూ.. వాసవీమాతాకి జై. మహాత్మాగాంధీ గారు దేశానికి స్వాతంత్ర్యం సాధిస్తే.. పొట్టి శ్రీరాములు గారు తెలుగుజాతికి గుర్తింపు సాధించిన వ్యక్తి. గాంధీ గారిని ఫాదర్ ఆఫ్ నేషన్ అంటే.. పొట్టి శ్రీరాములు గారిని ఫాదర్ ఆఫ్ లింగ్విస్టిక్ స్టేట్స్ అంటారు. కొన్నిదీపాలు వెలుగునిస్తాయి. కొన్ని దీపాలు దారిచూపిస్తాయి. ప్రాణత్యాగం చేసి కోట్లాది మంది తెలుగు ప్రజల కోసం దారిచూపించిన దీపం పొట్టి శ్రీరాములు గారు. ఈ రోజు ఆయన 58 అడుగుల విగ్రహం ఏర్పాటుకోసం మనందరం శంకుస్థాపన చేసేందుకు వచ్చాం. విగ్రహంతో పాటు ఆడిటోరియం, మెమోరియల్, మ్యూజియం, మినీ థియేటర్ ను 6.8 ఎకరాల్లో మన అమరావతి ప్రజా రాజధానిలో ఏర్పాటుచేసేందుకు ఇక్కడకు విచ్చేశాం.

**పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం వల్లే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది..** కేవలం విగ్రహం ఏర్పాటు మాత్రమే కాకుండా.. మొత్తం ప్రాజెక్టు పూర్తిచేసే బాధ్యత తీసుకోవాలని దూండి రాకేష్ ను కోరుతున్నా. 58 అడుగుల విగ్రహం ఎందుకు అని మనం అనుకోవచ్చు. దీనివెనుక చరిత్ర ఉంది. పొట్టి శ్రీరాములు గారు భాషా ప్రయుక్త రాష్ట్రం కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేశారు. ఆయన ప్రాణత్యాగం వల్లే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. దీంతో పాటు నెహ్రూ గారు ఫజల్ అలీ కమిషన్ ఏర్పాటుచేశారు. ఆ కమిషన్ వల్ల తమిళనాడు, కేరళ, కర్ణాటక,




మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలు కూడా ఏర్పడ్డాయి. పొట్టి శ్రీరాములు త్యాగం వల్ల ఒక్క ఆంధ్ర రాష్ట్రమే కాకుండా భాషా ప్రయుక్త రాష్ట్రాలు మనదేశంలో ఏర్పడ్డాయి.

**సమాజంలో మార్పు కోసం అహర్నిశలు పోరాడారు..** ఆయన ఆమరణ నిరాహార దీక్ష వల్ల దేశంలోనే పెను మార్పులువచ్చాయి. ఆయన కేవలం భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసమే పోరాడలేదు. సమాజంలో మార్పు కోసం అహర్నిశలు పోరాడారు. మన దళిత సోదరులు ఆలయ ప్రవేశం కోసం పోరాడారు. వివిధ సామాజిక అంశాలపై ఐదు సార్లు నిరాహార దీక్షలు చేశారు. ఆయన ఏకంగా సబర్మతి ఆశ్రమానికి వెళ్లి గాంధీ తాత దగ్గర నుంచి అహింసను ఆయుధంగా చేసుకున్నారు. గాంధీ తాతనే పొట్టి శ్రీరాములు లాంటివారు పది మంది ఉంటే చాలు.. దేశానికి స్వాతంత్ర్యం ఒక్క ఏడాదిలోనే వచ్చేదని చెప్పారు.

**నమ్ముకున్న సిద్ధాంతం కోసం జీవితం త్యాగం చేసిన వ్యక్తి పొట్టి శ్రీరాములు ..** నాలా లాంటి చాలా మంది మార్కుల కోసం పొట్టి శ్రీరాములు గారి గురించి పాఠ్యాంశాల్లో చదువుకున్నాం. కానీ ఆయన చేసిన కార్యక్రమాల వెనుక ఎంతో ఆలోచన, త్యాగం ఉందని గమనించాలి. మనం చాలా నేర్చుకోవాల్సి ఉంది. నమ్ముకున్న సిద్ధాంతం కోసం జీవితం త్యాగం

- 4లో

VAARAHI
— SILKS —
Threads of Luxury, Woven with love...



Patola Banaras | Kanjeevaram | Paithani | Organza | Chikankari | Soft Pattu | Muslin
Bandhini | Kanchi Tissue | Crush Tissue | Designer Tussar | Georgette | Fancy | Ikkat
VAARAHI SILKS Ph. 91000 03343 | www.vaarahisilks.com
Road No. 36, Jubilee Hills | Road No.1, Kukatpally.
SCAN TO FOLLOW US ON
INSTAGRAM FACEBOOK

## చైర్మన్ అలేఖ్యను ఘనంగా సన్మానించిన దుండి రాకేష్



**అమరావతి, కలంకౌంటర్ :** ఈ మధ్యనే కావలి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గా ప్రమాణస్వీకారం చేసిన ఆర్యవైశ్య ముద్దుబిడ్డ పోతుగంటి అలేఖ్య ని బుధవారం అమరావతిలో ఘనంగా సన్మానించిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ దూండి రాకేష్. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు పల్లపోతు వెంకటేశ్వర్లు, జలదంకి వెంకటకృష్ణారావు,చక్కా వెంకట కేశవరావు, కోటా కిషోర్, ఇన్నమూరి శ్రీను, ఇస్కాల సురేంద్ర, అమరా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## లడ్డు వేలంపాటలో



**తిరువూరు,కలంకౌంటర్ :** ఆర్యవైశ్య సమాజంలోజరుగుతున్న .... గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 7వ రోజు బుధవారం రాత్రి నిర్వహించిన స్వామి వారి కళ్యాణం లడ్డు వేలంపాటలో... తిరువూరు లక్ష్మి సెంటర్ వరలక్ష్మీ జ్యూయలర్స్ యజమాని గుడిమెట్ల నాగ వెంకట సతీష్ బాబు రూ. 20 వేల 116/- కు స్వామి వారి ప్రసాదమును దక్కించుకున్నారు. ఈ సందర్భంగా గణపతి ఉత్సవ కమిటీ వారు స్వామి వారి. ఆశీస్సులతో లడ్డు ప్రసాదమును పొందిన గుడిమెట్ల నాగ వెంకట సతీష్ బాబును శాలువాతో సత్కరించి లడ్డు ప్రసాదం ను అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆర్యవుస్య ప్రముఖులు గుడిమెట్ల మురళి,గుడిమెట్ల చిన వెంకటేశ్వరరావు ,గుడిమెట్ల చిన్న జగన్ (ఉల్లిపాయలు), బండారు శ్రీనివాసరావు ,దొడ్డా గుప్తా, గుడిమెట్ల రమేష్, అనుమోలు సాయికృష్ణ పాల్గొన్నారు

## బంగారు కుటుంబాలలో ఆనంద హేళ

- ముప్పాళ్ల వేదికగా పీ4 కార్యాచరణలో అద్భుత ఫలితాలు..
- జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ





**విజయవాడ, కలంకౌంటర్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలకు ప్రతిరూపమైన పీ4 మార్గదర్శి-బంగారు కుటుంబం కార్యరూపం దాల్చగా నేడు ముప్పాళ్లలో మార్గదర్శుల ద్వారా బంగారు కుటుంబాలకు అందుతున్న సహాయాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిష్టాత్మకంగా పీ4 కార్యక్రమంలో భాగంగా మార్గదర్శి %-% బంగారు కుటుంబాలతో లబ్ధి పొందుతున్న కొండ్రు వెంకటరావమ్మ, కోట వెంకటరత్నం ఇళ్ళకు బుధవారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ, ఆర్‌డీవో కె.బాలకృష్ణతో కలిసి వెళ్ళి వారి కుటుంబ సభ్యులతో ముచ్చటించి, వారి స్థితిగతులు, ఆదాయ పెరుగుదలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా పీ4 కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామి మేరకు కొండ్రు వెంకటరావమ్మ బంగారు కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఇళ్ల స్థలం, ఇంటి మంజూరు, ఆటో, కుట్టు మిషన్, కోట వెంకటరత్నం బంగారు కుటుంబానికి ఆటో ఇప్పించడంతో పాటు పిల్లలను ఉన్నత చదువులు చదివించి పేదరికం నుంచి బయటపడే వరకు మార్గదర్శులు తోడుండే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. పీ4 కార్యక్రమం మహాయజ్ఞం వంటిదని, దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఇటువంటి కార్యక్రమాన్ని చేపట్టిన దాఖలాలు లేవన్నారు. ఎంతో ముందుచూపు కలిగిన ముఖ్యమంత్రి పీ4 విధానాన్ని ప్రవేశపెట్టి బంగారు కుటుంబాలను ఎంపిక చేసి, మార్గదర్శుల సాయంతో ఆ కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకొని, పేదరికం నుంచి బయటపడాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారన్నారు. ఎన్‌టీఆర్ జిల్లాలో పీ4 కార్యక్రమం కార్యరూపం దాల్చడం, జిల్లా అధికారిగా నాకు గర్వకారణంగా ఉందన్నారు. జిల్లాలో 96 వేల బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందని, వీటికి మార్గదర్శులను తోడు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మార్గదర్శుల స్ఫూర్తితో ముందడుగు వేసేందుకు మరింత మంది మార్గదర్శులు ముందుకు రావాలన్నారు. బంగారు కుటుంబాలకు, సహాయాన్ని స్వయంగా వారే అందించి, వారు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషిచేయడం ద్వారా రాబోయే తరంలో వారి కుటుంబ సభ్యులకు ఒక మంచి కార్యక్రమాన్ని అందించామనే సంతృప్తి మార్గదర్శులకు మిగుల్చుతుందనే దాంట్లో ఎలాంటి సందేహం లేదని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. పర్యటనలో ఎంపిడివో పద్మజ్యోతి, తహశీల్దార్ రామకోటేశ్వరావు ఉన్నారు.





పర్యాటక శాఖపై సమీక్ష నిర్వహించిన మఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. అనంతరం రాష్ట్రపతి భవన్ లో ప్రదర్శించే పురాతన తెలుగు తాళపత్ర గ్రంథాలను పరిశీలించిన ముఖ్యమంత్రి.

-అమరావతి ,కలంకౌంటర్ :

## పీపీపీ మోడల్ లో లిడ్ క్యాప్ భూముల అభివృద్ధి

- విజయవాడ, తిరుపతిలో మల్టీ పర్పస్ కాంప్లెక్స్ ల నిర్మాణం
- మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి





**అమరావతి / వెలగపూడి సచివాలయం,కలంకౌంటర్ :** లిడ్ క్యాప్ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడడంతోపాటు వాటిని పీ.పీ.పీ మోడల్ లో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం నాడు అమరావతిలోని వెలగపూడి సచివాలయంలో లిడ్ క్యాప్ పై అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సమీక్షలో తిరుపతి, విజయవాడలో మల్టీపర్పస్ కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్మాణంపై మంత్రికి అధికారులు పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా తిరుపతి ఎస్వీ ఆటో నగర్ లోని 4.5 ఎకరాలు, విజయవాడ ఆటో నగర్ లో 1 ఎకరా లిడ్ క్యాప్ సలాల్లో మల్టీ పర్పస్ కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్మాణం చేసే అంశంపై సమీక్షలో సుధీర్ఘంగా చర్చించారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి విధి, విధానాలు రూపొందిస్తామని మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. ఈ సమీక్షలో లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు, సోషల్ వెల్ఫేర్ సెక్రటరీ ఎం. ఎం. నాయక్, లిడ్ క్యాప్ ఎండీ ప్రసన్న వెంకటేష్, ఈడీ టీవీఎస్ ప్రసాదరావు,సునీల్ రాజ్ కుమార్, లిడ్ క్యాప్ మేనేజన్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి ముంగిటకే చేనేత వస్త్రాలు

(మొదటి పేజీ తరువాయి)

చేనేత రెడీమేడ్ దుస్తులను ఆన్ లైన్, ఆఫ్ లైన్ లో అందుబాటులో ఉంచింది.

**చేనేత వస్త్రాల డోర్ డెలివరీ..** ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఈ కామ-ర్స్ దే హవా. ఇంటి దగ్గర నుంచే ఇంటికి, తమకు అసవరమైన వస్తువులు, సరకులను ఈ కామర్స్ ద్వారా వినియోగదారులు కొనుగోలు చేసుకుంటున్నారు. మారుతున్న అభిరుచులకు అనుగుణంగా, నేతన్నలు నిలదొక్కుకోడానికి ఈ కామర్స్ లోకి రాష్ట్ర ప్రభుత్వం అడుగుపెట్టింది. చీరలు, దోతీలతో పాటు రెడీమేడ్ చేనేత వస్త్రాలను ఈ కామర్స్ లో లభించేలా విక్రయాలు ప్రారంభించింది. నేరుగా ఇళ్ల వద్దకే చేనేత వస్త్రాలను డోర్ డెలివరీ చేసేలా వ్యవస్థను రూపొందించింది. చాలా తక్కువ కాలంలోనే ఆన్ లైన్ ద్వారా రూ.45 లక్షల విలువైన చేనేత వస్త్రాలు అమ్మకాలు జరిగాయి. ఈ అమ్మకాలను మరింత పెంచేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కామర్స్ లో చేనేత వస్త్రాల లభ్యతపై విశేష ప్రచారం ప్రారంభించింది.

**ఈ కామర్స్ కు 40 ఆప్కో షో రూమ్ ల అనుసంధానం..** రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆప్కో ద్వారా చేనేత అమ్మకాలు జరుగుతున్నాయి. రాష్టంతో పాటు దేశ వ్యాప్తంగా 92 ఆప్కో షో రూమ్ లున్నాయి. గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత పుట్టపర్తి, ప్రొద్దుటూరు, టెక్కలి, ఎమ్మిగనూరు, అనకాపల్లిలో అయిదు షో రూమ్ లను ప్రారంభించింది. చేనేత వస్త్రాల వినియోగంపై ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తి అనుగుణంగా 40 ఆప్కో షో రూమ్ ల ద్వారా ఆన్ లైన్ లో చేనేత వస్త్రాల అమ్మకాలను ప్రారంభించింది. అమెజాన్, ఫ్లిప్ కార్ట్, జియో మార్ట్ వంటి ఈ కామర్స్ సంస్థలకు ఈ 40 ఆప్కో షో రూమ్ లను అనుసంధానం చేసింది.

**నూతన డిజైన్లతో చేనేత రెడీమేడ్ దుస్తులు..** చేనేత అనగానే అందరికీ గుర్తుకొచ్చేది చీరలు, తువాళ్లు, లుంగీలు, దుప్పట్లు, షర్ట్ బిట్లు. ప్రస్తుత తరం అభిరుచులకు అనుగుణంగా, అన్ని వర్గాల వారికి నచ్చేలా నూతన డిజైన్లతో రెడీమేడ్ చేనేత వస్త్రాలను తయారు చేసి, అమ్మకానికి పెట్టింది. ఇందుకోసం పలువురు డిజైనర్లను సైతం ప్రభుత్వం నియమించింది. వధూ వరులకు అవసరమైన దోతీలు, మోడి జాకట్లు, చీరలు, షర్టులు, లెనిన్ షర్ట్ లతో పాటు నేటి యువతను ఆకట్టుకునేలా కుర్తాలు, షార్ట్ కుర్తాలను సైతం అమ్మకాలు చేస్తున్నారు. చిన్న పిల్లలకు కూడా సరిపడేలా గౌన్లు, ఇతర దుస్తులను కూడా కొత్త కొత్త డిజైన్లతో సిద్ధం చేసి విక్రయాలు చేస్తోంది. కలంకారీ చీరలు, పెన్ కలంకారీ చీరలు, డిజిటల్ ప్రింటెడ్ చీరలు, ఎంబ్రాయిడింగ్ చీరలను కూడా ఆప్కో షో రూమ్ లతో పాటు ఆన్ లైన్ లోనూ విక్రయిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ఈ కామర్స్ లో చేనేత వస్త్రాల లభిస్తుండడంతో, విక్రయాలు ఘణనీయంగా పెరిగాయి. దీంతో చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ పెరిగి, నేతన్నలకు ఆర్థిక భరోసా లభిస్తోంది.

**నేతన్నకు 365 రోజుల ఉపాధే లక్ష్యం ..** నేతన్నలు గౌరవప్రదమైన జీవనం సాగించడంతో 365 రోజులూ వారికి ఉపాధి కల్పించాలన్నది సీఎం చంద్రబాబునాయుడు లక్ష్యం. నేతన్నలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే...మరోవైపు చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పనతో చేనేత రంగంలో ఉత్సాహం నెలకొంది. చేనేత ఉత్పత్తుల విక్రయాల పెంపుదలకు కో ఆప్టెక్స్, టాటా తనేరియా, ఆద్యం బిర్లా గ్రూప్ తో ఒప్పందాలు చేసుకున్నాం. ముఖ్యంగా ఈ కామర్స్ లో దిగ్గజ సంస్థలైన ఫ్లిప్ కార్ట్, అమెజాన్, జియో మార్ట్, ఓఎన్డీసీ ద్వారా ఆన్ లైన్ లో చేనేత దుస్తుల అమ్మకాలను ప్రారంభించాం. నేటి తరం అభిరుచులకు అనుగుణంగా రెడీమేడ్ చేనేత వస్త్రాలను తయారు చేయించి, ఆప్కో షో రూమ్ లతో పాటు ఆన్ లైన్ లోనూ అమ్మకాలు చేస్తున్నాం. నేతన్నలకు రెడీమేడ్ దుస్తుల కోసం అవసరమైన మెటీరియల్ తయారీపై శిక్షణ సైతం అందజేస్తోంది. దీంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా చేనేత అమ్మకాలు ఊపందుకున్నాయి.

## మెగా డి.ఎస్.సి లో సత్తా చాటిన మైనారిటీలు

- 152 మంది మైనారిటీలకు ఉపాధ్యాయ ఉద్యోగాలు
- పోటీ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీలకు ఉచిత శిక్షణ
- ఆన్ లైన్ లో కూడా శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు
- రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి



**అమరావతి,కలంకౌంటర్ :** కేంద్ర, రాష్ట్రస్థాయిలో జరిగే వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు హాజరయ్యే మైనారిటీ అభ్యర్థులకు సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్(సిఈడియం) ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మెగా డి ఎస్ సి లో సిఈడిఎం ద్వారా శిక్షణ తీసుకొని 152 మంది ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైనట్లు బుధవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.అల్పసంఖ్యాక వర్గాల అభ్యున్నతి కోసం1994లో తెలుగుదేశం ప్రభుత్వం సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ (సిఈడియం) ను స్థాపించడం జరిగిందని అన్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం రాష్ట్రంలో కర్నూలు, గుంటూరు, విశాఖపట్నం లలో మూడు ప్రాంతీయ కార్యాలయాలు కూడా నిర్వహించబడుతున్నాయ ని పేర్కొన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ నేతృత్వంలో కేంద్ర స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో భర్తీ చేసే ఉద్యోగాలకు జరగబోయే పోటీ పరీక్షల కోసం సంసిద్ధమయ్యే మైనారిటీ విద్యార్థులకు ప్రముఖ కోచింగ్ సెంటర్లలో ఉన్న నైపుణ్యమైన సిబ్బంది ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇటీవల కూటమి ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి విడుదల చేసిన మెగా డిఎస్సీ పరీక్షలకు సిఈడిఎం పర్యవేక్షణలో 1780 మంది మైనారిటీ అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇందులో 1200 మందికి పైగా అభ్యర్థులు అర్హత మార్కుల కంటే ఎక్కువ మార్కులు సాధించడం జరిగిందన్నారు. ఉచిత శిక్షణను సమ-ర్థవంతంగా వినియోగించుకుని, విజయం సాధించిన 152 మంది మైనారిటీ అభ్యర్థులు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో విద్యార్హత ధ్రువపత్రాల పరిశీలన కు హాజరై ఉద్యోగాల్లో చేరేందుకు సిద్ధం గా ఉన్నారని మంత్రి ఫరూక్ వెల్లడించారు. సిఈడిఎం ద్వారా ఉచిత శిక్షణను వినియోగించుకొని విజయం సాధించి ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన 152 మందికి మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యం లో త్వరలో సన్మానించబోతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సిఈడియం ను మరింత సమర్థవంతం గా నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలను కార్యాచరణ బద్ధంగా అమలు చేస్తున్నట్టు తెలిపారు. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎక్కువ మందికి సులభంగా సేవలు చేరేందుకు, ఆన్ లైన్ లో కూడా శిక్షణ ఇచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమానికి, ఇచ్చిన హామీలను అమ లు చేసేందుకు కూటమి ప్రభుత్వము కట్టుబడి ఉందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

## రాష్ట్రంలో శరవేగంగా పర్యాటక ప్రాజెక్టుల నిర్మాణం

- పర్యాటక శాఖపై సీఎం చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమీక్షలో వర్చువల్ గా పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్
- రాష్ట్రంలో చేపట్టిన వివిధ పర్యాటక ప్రాజెక్టుల పురోగతిని సీఎం కు వివరించిన మంత్రి దుర్గేష్

**అమరావతి/ రాజమహేంద్రవరం,కలంకౌంటర్ :** పర్యాటక శాఖపై సీఎం చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమీక్షలో మంత్రి కందుల దుర్గేష్ వర్చువల్ గా పాల్గొన్నారు. ఈ మేరకు రాష్ట్రంలో చేపట్టిన వివిధ పర్యాటక ప్రాజెక్టుల పురోగతిని సీఎంకు వివరించారు. అదేవిధంగా గోదావరి పుష్కరాలకు సంబంధించి ముందస్తుగా కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహిద్దామని మంత్రి కందుల దుర్గేష్ సూచించగా అందుకు సీఎం చంద్రబాబు నాయుడు అంగీకరించారు. అఖండ గోదావరి పర్యాటక ప్రాజెక్టు క్రింద చేపట్టిన హేవలాక్ బ్రిడ్జిని త్వరితగతిన పర్యాటకులకు అందుబాటులోకి తెస్తామని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. సీఎం సూచనల మేరకు రాజమండ్రిని స్పెషల్ టూరిజం హబ్ గా చేపట్టేలా ప్రాజెక్టులపై దృష్టి సారిస్తామని సీఎంకు తెలిపారు. పర్యాటకంలో అరకు కాఫీ, కూచిపూడి, ఎర్రచందనం ఉత్పత్తుల బ్రాండింగ్ చేపడతామన్నారు. పర్యాటకుల భద్రతకు పెద్దపీట వేస్తూ సెప్టెంబర్ లో సూర్యలంక బీచ్ లో ప్రపంచ పర్యాటక దినోత్సవం ఘనంగా నిర్వహిస్తామని తద్వారా పర్యాటక రంగానికి ప్రచారం కల్పిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో పర్యాటక ప్రాజెక్టులు చేపట్టేందుకు స్థలాలను గుర్తించాలన్న సీఎం ఆదేశాలను త్వరలోనే అమలు చేస్తామని మంత్రి దుర్గేష్ వెల్లడించారు.

## బలహీనంగా ఉన్న స్థానిక సంస్థలకు ఊతమిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పని చేస్తే... ప్రభుత్వానికి మంచి పేరు వస్తుంది. ఆర్థిక సంవత్సరం చివరికి పంచాయతీల్లోనూ, పట్టణాభివృద్ధి సంస్థల్లోనూ ఆడిటింగ్ పూర్తి చేయాలి.' అన్నారు.

**ఆదాయాలు-బకాయిల లెక్కలు తేల్చండి: డెప్యూటీ సీఎం..** 2019 నుంచి 2024 మధ్య కాలంలో స్థానిక సంస్థలు ఆస్తి పన్నుల వసూళ్లు ఎంత జరిగాయి...? ఇంకెంత బకాయిలు ఉన్నాయో...? లెక్కలు తేల్చాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి సూచించారు. ప్రజలు చెల్లించే పన్నుల వివరాలు ప్రతీది ఆన్‌లైన్ చేయాలని నిర్దేశించారు. గ్రామాల్లో పౌల్ట్రీ పరిశ్రమలకు సంబంధించిన వివిధ అంశాలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేయాలని చెప్పారు. గ్రామ ప్రజలకు, పౌల్ట్రీ పరిశ్రమలకు ఇబ్బందిలేని విధానాన్ని తీసుకురావాలన్నారు.

**స్థానిక సంస్థల రిసోర్స్ గ్యాప్-రాష్ట ఆర్థిక సంఘం నివేదిక..** ఆర్థికంగా రాష్ట్రం కొన్ని సవాళ్లు ఎదుర్కొంటోందని 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవసత్సరాన్ని పరిశీలిస్తే రాష్ట్ర సొంత ఆదాయం కన్నా జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులకు ఖర్చు పెట్టే మొత్తం 111 శాతంగా ఉందని వెల్లడించింది. అంతేకాకుండా... రాజధాని నిర్మాణం, సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల అమలు వంటి లక్ష్యాలు ఉన్నాయని స్పష్టం చేసింది. 2025-26 నుంచి 2029-30 వరకు పంచాయతీరాజ్ సంస్థల రిసోర్స్ గ్యాప్ రూ. 7,033 కోట్లు ఉంటుందని ఆర్థిక సంఘం లెక్క తేల్చింది. అలాగే ఇదే కాలానికి పట్టణ స్థానిక సంస్థల రిసోర్స్ గ్యాప్ రూ. 2,016 కోట్లుగా ఉంది. అలాగే ఆస్తి పన్నుల డిమాండ్-కలెక్షన్ మధ్య భారీ వ్యత్యాసం ఉందని చెప్పింది.

**విద్యుత్ బిల్లులు చెల్లించని గత ప్రభుత్వం..** జూన్ 2024 వరకు గత ప్రభుత్వం చెల్లించకుండా వదిలేసిన గ్రామ పంచాయతీల విద్యుత్ బిల్లులు రూ. 5,851.58 కోట్లు ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు వివిధ రూపాల్లో నిధుల సమీకరణ రూ. 2,617 కోట్లుగా ఉంది. ఇందులో అత్యధికంగా సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్ అందిస్తున్న గ్రాంట్స్ రూపంలోనే ఉన్నాయి. ఆ తర్వాత ఆస్తి పన్నులతో ఎక్కువ నిధులు సమకూరుతున్నాయి. పంచాయతీరాజ్ సిబ్బందికి ఏటా జీతాల రూపంలో రూ. 393.77 కోట్లు, మున్సిపల్ సిబ్బందికి రూ. 1,672.45 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. ఈ సమావేశంలో రాష్ట్ర 5వ ఆర్థిక సంఘం ఛైర్ పర్సన్ రత్నకుమారి, సభ్యులు ప్రసాదరావు, కృపారావు సహా ఆర్థిక, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దుష్ప్రచారం చేస్తున్న వారిని ప్రజలు క్షమించరు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు...గెజిటెడ్ ఆఫీసర్స్ టైప్ -1 భవనాల్లో 4 టవర్లలో 384 ఫ్లాట్లు,ఒక్కొక్కటి 1800 చదరపు అడుగుల విస్తీర్ణంలో 9.62 లక్షల విస్తీర్ణంలో పనులు వేగంగా జరుగుతున్నాయి...ఇక టైప్ -2 భవనాల్లో మరో 4 టవర్లలో 336 ఫ్లాట్లు ఒక్కొక్కటి 1500 చదరపు అడుగుల విస్తీర్ణంలో 7.4 లక్షల విస్తీర్ణంలో జరుగుతుంది...మరోవైపు గ్రూప్ - డి ఉద్యోగుల కొరకు మొత్తం 6 టవర్లలో 720 ఫ్లాట్లు ఒక్కొక్కటి 900 చదరపు అడుగుల విస్తీర్ణంలో 10.2 లక్షల విస్తీర్ణంలో వేగంగా నిర్మాణం జరుగుతున్నాయని మంత్రి చెప్పారు... మొత్తంగా 27 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 1440 ఇళ్ల నిర్మాణాలు దాదాపు తుది దశకు చేరుకున్నాయి...శ్లాబ్ పనులు దాదాపు పూర్తికాగా...మిగిలిన వాటికి నవంబర్ నాటికి పూర్తవుతాయి...సీవరేజ్ ప్లాంట్ నిర్మాణం కూడా వేగంగా జరుగుతుంది...అన్ని భవనాలు మార్చి నెలాఖరులోగా పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా వెళ్తున్నట్లు మంత్రి చెప్పారు...వీటిలో 50 శాతం ఇళ్లు అక్టోబర్ రెండు నాటికి పూర్తవుతాయని....అయితే అన్ని నిర్మాణాలు పూర్తయిన తర్వాతే అధికారులకు అప్పగిస్తామన్నారు.

**అమరావతి చాలా సేఫ్ సిటీ..** అమరావతిలో 360 కిమీ మేర ట్రంక్ రోడ్లు,1500 కిమీ మేర లే అవుట్ రోడ్లు,4000 నివాస భవనాలు,ఐకానిక్ భవనాలు పనులు ఎంతో వేగంగా జరుగుతున్నాయి.కానీ అమరావతిలో పనులేమీ జరగడం లేదని పనిగట్టుకుని కొంతమంది దుష్ప్రచారం చేస్తున్నారు..అసలు అమరావతిలో ఏం జరుగుతుందో ఇక్కడికి వచ్చి చూస్తే తెలుస్తుంది...అమరావతి అంతా గ్రాఫిక్స్ అంటున్న వారిని ప్రజలు క్షమించరని...అమరావతి చాలా సేఫ్ సిటీ అన్నారు.అమరావతిలో వరద నివారణ కొరకు నెదర్లాండ్స్ నిపుణులతో డిజైన్ చేయించామన్నారు.. అమరావతికి ఎలాంటి ముంపు లేకుండా కాలువలు,రిజర్వాయర్లు నిర్మాణం చేస్తున్నారు..ఏది ఏమైనా చెప్పిన ప్రకారం మూడేళ్లలో అమరావతిని పూర్తి చేస్తామని మంత్రి నారాయణ తేల్చి చెప్పారు.

## రసాయన-శాస్త్ర అధ్యాపకురాలికి డాక్టరేట్



**పిట్టలవాని పాలెం (బాపట్ల జిల్లా),కలంకౌంటర్ :** కె. వి. ఆర్. కె. వి. ఆర్ & ఎమ్. కె.ఆర్ కళాశాల, ఖాజీ పాలెం. పి.జి. కెమిస్ట్రీ విభాగం నందు రసాయన శాస్త్ర అధ్యాపకురాలిగా పని చేస్తున్న యూని వర్సిటీ నుండి డి. రామచంద్రన్ అధ్యాపకురాలుగా ఉప్పల సాటి విద్యామ-ణి ఆచార్య నాగార్జున డాక్టరేట్ పొందారు . యూనివర్సిటీ ప్రొఫెసర్-పర్య వేక్ష ణ లో వర్గీకరించబడిన ఔషద మందు పదార్థాలు మరియు ఔషద మందు ఉత్పత్తులలో ఉన్న ఏక కాలంలో పరిమాణీకరణ కోసం ధ్రువీకరణ పద్ధయలు మలినాలను అనే అంశంపై పరిశోధన చేశారు. అధ్యాపకురాలిని కళాశాల ప్రెసిడెంట్ మంతెన నరసరాజు , సెక్రటరీ మందిన శ్రీనివాసకుమార్, మంతెన వెంకట శివ రామరాజు , జై మంతెన కృష్ణం రాజు ,ప్రిన్సిపాల్ కీ టి. శివప్రసాద్ , అధ్యాపక బృందం విద్యారథనీ, విద్యార్థులు అభినందనలు తెలియచేశారు.

# అమరజీవి కాంస్య విగ్రహ శంకుస్థాపనలో పాల్గొన్న ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య నాయకులు









**అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతివనం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం లో పాల్గొన్న వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు ఇరుకుల్ల రామకృష్ణ తదితరులు..**



**అమరావతి,కలంకౌంటర్ :** అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల కాంస్య విగ్రహం, స్మృతి వనం శంకుస్థాపన కార్యక్రమం డూండీ రాకేష్ ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పల్లపోతు వెంకటేశ్వర్లు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, తెలుగుదేశం పార్టీ నాయకులు వక్కలగడ్డ మల్లికార్జున రావు, ప్రకాశం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి జలదంకి వెంకటకృష్ణారావు, బొగ్గవరపు సుబ్బారావు, శ్రీ వాసవి శివగంగా నిత్య అన్నదాన ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి కనమర్లపూడి హరిప్రసాదరావు, మహాసభ కార్యదర్శి చీదెండ్ల నాగేశ్వరరావు,ఆర్యవైశ్య మీడియా చైర్మన్ డా" చక్కా వెంకట కేశవరావు, అమరా భాను ప్రకాష్, ఉపాధ్యక్షులు సింగంశెట్టి మల్లి, జరుగుమల్లి మండల అధ్యక్షులు కోటా కిషోర్, గుడ్లూరు మండల అధ్యక్షులు అమరా మాల్యాద్రి, కాకుమాని వాసు,ఇన్నమూరి శ్రీను, ఇస్కాల సురేంద్ర అగర్వాల్, సుబ్బారావు గుప్తా, కోళ్లపూడి బ్రహ్మయ్య, కృష్ణ, మువ్వల నాగరాజు తదితర ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## బ్లాక్ ఫారెస్ట్ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది

**- తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష.**



**తిరుపతి,కలంకౌంటర్ :** వి.యస్.ఆర్ క్రియేషన్స్ పథకంపై త్వరలో ప్రారంభం కానున్న సస్పెన్స్ కమర్షియల్ థ్రిల్లర్ బ్లాక్ ఫారెస్ట్ మూవీ స్క్రిప్ట్ పూజ కార్యక్రమం బుధవారం పుత్తూరు బైపాస్ రోడ్డు అంజారమ్మ కణం లో అంజారమ్మ దేవాలయం అమ్మవారి సన్నిధానంలో తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా క్లాప్ కొట్టి, టీమ్ సభ్యులను, ఆర్టిస్టులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిర్మాత వి.యస్. రెడ్డి, సినిమా దర్శకుడు అనురాగ్ శివ, లీడ్ రోల్ ఆర్టిస్టులు శ్రావణి, తన్సియా, శ్రీలీల,సందీప్ లు పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ బ్లాక్ ఫారెస్ట్ మూవీ బ్లాక్ బస్టర్ హిట్టు అవుతుందని, సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాలో ఈ జోనర్ ఎవరు టచ్ చేయలేరని తెలియజేశారు. ఈ సినిమా ద్వారా దర్శకుడు అనురాగ శివ పెద్ద డైరెక్టర్ అవ్వాలని తెలిపారు. ఈ సినిమా ద్వారా నిర్మాత వి.యస్.రెడ్డి మంచి లాభాలు, మంచి సినిమాలు రావాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నాం. నిర్మాత మాట్లాడుతూ ఈ సినిమా షెడ్యూల్ త్వరలో ప్రారంభమవుతాయని తెలిపారు. మా సినిమాకు తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష గారు పాల్గొనడం సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ రమేష్, తులసి యాదవ్, గంగాధర్ బాబు, హేమా రెడ్డి, వెంకటేశ్వర్లు, యువరాజ్ యాదవ్, సురేంద్ర, దిలీప్, చైతన్య రాజు,పి.వి.రెడ్డి, విజయ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా కూటమి పాలన: ఎమ్మెల్యే ఇంటూరి

**–మహాదేవపురంలో 20 లక్షల సీసీ రోడ్ల పనుల శంకుస్థాపన**





**కందుకూరు,కలంకౌంటర్ :** రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడి నాయకత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించేలా పరిపాలన సాగిస్తోందని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. కందుకూరు మండలం మహాదేవపురం గ్రామంలో 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించబోయే సీ.సీ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కందుకూరు నియోజకవర్గంలో ఎన్ ఆర్ జి ఎస్ గ్రాంట్ ద్వారా 40 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి నియోజకవర్గ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వంలో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యమైందని, పల్లెల్లో నూతన రోడ్ల నిర్మాణం ఎక్కడ జరగలేదని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నా, అనుభవజ్ఞుడైన ముఖ్యమంత్రి ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని తెలిపారు. రామాయపట్నం పోర్టు ఆరు నెలల్లో కార్యకలాపాలు ప్రారంభించబోతోందని చెప్పారు. బిపిసిఎల్, ఇండోసోల్ వంటి భారీ పరిశ్రమలు రాబోతున్నాయని, వాటితో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే ఇంటూరి తెలిపారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే గారికి గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ అధికారులు, మండల పార్టీ అధ్యక్షుడు బుసారెడ్డి కృష్ణారెడ్డి, గ్రామ అధ్యక్షుడు హరికృష్ణ, నాయకులు నార్నే రోశయ్య, గుల్లా సుధాకర్, దామా అశోక్, గుల్లా సుబ్బయ్య, దామా చెంచయ్య, గుల్లా మాలకొండయ్య, పత్తిపాటి ప్రసాద్, తుమాటి నాగరాజు, మేనికొండ మధు తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ పాలనలోనే తెలంగాణకు స్వర్ణయుగం - బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

- కేసీఆర్ నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులతో తెలంగాణ సస్యశ్యామలం అయింది
- కేసీఆర్ పై సిబిఐ విచారణ జరపాలనుకోవడం సిగ్గుచేటు
- సిబిఐ పనితీరుపై రాహుల్ , రేవంత్ లది ద్వంద్వ వైఖరి
- 21 నెలల కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆగమాగం అయింది
- దమ్మున్న నాయకుడు ఉంటే దమ్మిడీ లేకున్నా సంక్షేమ పథకాల ఆగవు.
- చిత్తశుద్ధి లేనివాళ్లనే చెప్పులు ఎత్తుకుపోయేవారిలా చూస్తారు
- తన అనుచరులతో బీఆర్ఎస్ లో చేరిన మణుగూరుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత ప్రభాకర్ రావు

**తెలంగాణ, కలంకౌంటర్ :** మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ లతో రాబోయే 50 ఏండ్ల హైదరాబాద్ తాగునీటి అవసరాలను తీర్చిన దార్శనికుడు కేసీఆర్ పై సిబిఐ విచారణ జరపడం సిగ్గుచేటు అన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారక రామారావు. సిబిఐని మోడీ జేబు సంస్థ అని రాహుల్ విమర్శిస్తే, రేవంత్ దాన్ని ప్రశంసించడం కాంగ్రెస్ దౌర్భాగ్యస్థితికి నిదర్శనం అన్నారు. పినపాక నియోజకవర్గం, మణుగూరుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ప్రభాకర్ రావు, ఆయన అనుచరులు ఇవాళ ఎర్రవల్లిలో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన కేటీఆర్, భారత దేశ చరిత్రలో ఏ రాజకీయ నాయకుడు కూడా పదేళ్లలో కేసిఆర్ చేసినంత అభివృద్ధి చేయలేదన్నారు. కాళేశ్వరంతో తెలంగాణ పచ్చబడుతుంటే కొంతమంది కళ్లు ఎర్రబడుతున్నాయన్నారు. కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు అనుక్షణం గుర్తు తెచ్చుకుంటుంటే ఓర్వలేకనే కాంగ్రెస్, బీజేపీలు కక్షపూరితంగా అక్రమ కేసులతో కేసీఆర్ ను బద్నాం చేస్తున్నాయని ఆరోపించారు. రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో ఆగమాగమైందని, ప్రజలంతా కేసీఆర్ పాలననే తిరిగి కోరుకుంటున్నారని కేటీఆర్ చెప్పారు. కేవలం 21 నెలల కాంగ్రెస్ పాలనలోనే ప్రజలు విసిగిపోయారని, "కేసీఆర్ ఉన్నప్పుడే బాగుంది" అని ప్రతి ఒక్కరూ అంటున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని విరుచుకుపడ్డారు. ఎన్నికలకు ముందు హామీల జాతర, ఎన్నికల తర్వాత చెప్పుల జాతర అన్నట్టుగా రాష్ట్రంలో యూరియా కొరత రైతులను తీవ్రంగా వేధిస్తోందన్నారు. వ్యవసాయ సొసైటీల ముందు రైతులు చెప్పుల వరుసలు పెట్టి పడిగాపులు కాయాల్సిన దుస్థితిని కాంగ్రెస్ కల్పించిందన్నారు. ఆనాటి దుర్భర రోజులను మళ్లీ తీసుకొస్తా అని చెప్పి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజలను నిజాయితీగా మోసం చేశాడని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

## నగలు, 10 వేలు చెల్లించాలని ఇండియన్ బ్యాంక్ అధికారులకు ఆదేశం

**-కృష్ణాజిల్లా పర్మనెంట్ లోక్ అదాలత్ తీర్పు**

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** బ్యాంకు కస్టమర్ తనక పెట్టిన బంగారు నగలను 15 రోజుల్లోపు తిరిగి అందజేయాలని అదనంగా 3000 రూపాయలు సేవా లోపం నిమిత్తం ఐదు వేల రూపాయలు, మానసిక వ్యధ కలిగించినందుకు 2,000 లీగల్ ఖర్చులు కింద చెల్లించాలని భీమవరం ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ని ఆదేశిస్తూ కృష్ణాజిల్లా పర్మనెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ చైర్మన్ ఓ. వెంకట నాగేశ్వరరావు సభ్యులు ఎస్ నరసింహారావు, వేము కోటేశ్వరరావు బుధవారం తీర్పు చెప్పారు. మచిలీపట్నం కు చెందిన ఇల్లూరి వెంకట నరసయ్య తన అవసరాల కోసం 2018 నవంబర్ మూడో తేదీన 45 గ్రాములు బంగారాన్ని తాకట్టు పెట్టి 64,000 గోల్డ్ లోన్ కోసం భీమవరం కెనరా బ్యాంకు కి వెళ్ళాడు నగలు తీసుకున్న బ్యాంకు అధికారులు గోల్డ్ లోన్ డబ్బులు ఇవ్వకుండా గతంలో కాపు కార్పొరేషన్ లోన్ అమౌంట్ పెండింగ్ లో ఉందని అందు నిమిత్తం గోల్డ్ లోన్ డబ్బులు లోను కింద జమ వేసుకున్నామని సమాధానం చెప్పారు.. కస్టమర్ బ్యాంకు ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందన లేదు. ఇండియన్ బ్యాంకు వారు తనని మోసం చేశారని తన నగలు తీసుకుని డబ్బులు చెల్లించలేదని 2019లో మచిలీపట్నంలోని పెర్మనెంట్ లోక అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ లో ఫిర్యాదు దాఖలు చేశారు. ఉభయ పార్టీల వాదన మరియు 22 డాక్యుమెంట్లను పరిశీలించి కస్టమర్ కి అనుకూలంగా తీర్పు చెప్పారు. కస్టమర్ బ్యాంకులో పెట్టిన నగలను 15 రోజుల్లోపు తిరిగి అందించాలని, బ్యాంకు సేవా లోపం కింద 3,000 రూపాయలు కస్టమర్ కి మానసిక వ్యధ గురి చేసినందుకు 5,000 రూపాయలు కోర్టు ఖర్చు కింద ?2000 ను నెలరోజుల్లోపు చెల్లించాలని తీర్పు చెప్పారు. ఫిర్యాదుదారుడు తరుపున మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అడపా మురళి కేసును వాదించారు.

## గుత్తా సుఖేందర్ రెడ్డికి కల్వకుంట్ల కవిత ఫోన్

**తెలంగాణ, కలంకౌంటర్ :** నిజామాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పదవికి కల్వకుంట్ల కవిత చేసిన రాజీనామా లేఖను బుధవారం తెలంగాణ శాసన మండలి కార్యాలయంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఓఎస్డీకి తెలంగాణ జాగృతి నాయకులు అందజేశారు. అనంతరం గుత్తా సుఖేందర్ రెడ్డికి కవిత ఫోన్ చేశారు. తన రాజీనామాను ఆమోదించాలని కోరారు. ప్రస్తుతం తాను అందుబాటులో లేనని.. రేపు మరోసారి ఫోన్లో మాట్లాడి రాజీనామాపై నిర్ణయం తీసుకుంటానని చైర్మన్ గుత్తా చెప్పారు. అంతేకాదు.. బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి చేసిన రాజీనామా లేఖను తెలంగాణ భవన్లో పార్టీ ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్ రెడ్డికి తెలంగాణ జాగృతి నాయకులు అందజేశారు. లేఖను తీసుకొని రిసీవ్డ్ కాపీ భవన్ సెక్రటరీ అందజేశారు.



**అమరావతి లో అమరజీవి పొట్టి శ్రీరాములు 58 అడుగుల కాంస్య విగ్రహ శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిసిన తెలుగుదేశం పార్టీ నాయకులు నల్లమల్లి బాలు.**

–అమరావతి,కలంకౌంటర్ :

# అమరావతి లో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతివనం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం దృశ్యాలు













(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఈ రోజు ఒక్క మార్కు తక్కువ వస్తే ఆత్మహత్యలు చేసుకునే రోజులు. పొట్టి శ్రీరాములు గారి దగ్గర నుంచి పట్టుదల, కమిట్ మెంట్ నేర్చుకోవాలి. మనం ఏదైనా సాధించాలనుకుంటే తొలి అడుగు వేస్తే సమాజం మొత్తం మన వెనుక ఉంటుంది. ఇప్పుడు ప్రదర్శించిన వీడియోలో చూశాం. ఆయన దీక్షకు కూర్చొన్నప్పుడు చాలామంది రాలేదు. ఎప్పుడైతే ఆయన ఆరోగ్యం క్షీణించడం మొదలుపెట్టిందో ఆంధ్ర రాష్ట్రం మొత్తం ఆయన వెనుక వచ్చింది. చివరకు అంత్యక్రియలకు కూడా ఎవరినీ రానివ్వకుండా చేస్తే ఆనాటి పెద్దలు చేసే పరిస్థితి.

**పొట్టి శ్రీరాములు ని స్ఫూర్తిగా తీసుకుని అనుకున్నది సాధించాలి..** ఇన్ని దశాబ్దాలైనా ఈ రోజు ఆయన్ను గుర్తుచేసుకుంటున్నామంటే.. ఆయన చేసిన త్యాగం వల్లే. మనం ఏ కార్యక్రమం చేసిన ఆయన్ను గుర్తుచేసుకోవాలి. ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని మనం అనుకున్నది సాధించాలి. పొట్టి శ్రీరాములు గురించి మాట్లాడుకుంటున్నప్పుడు ఆర్యవైశ్య సామాజిక వర్గం నుంచి కొణిజేటి రోశయ్య గారు నాకు గుర్తుకువస్తారు. రోశయ్య తాత ఎప్పుడైతే గవర్నర్ అయ్యారో ఏడాదికోసారి ఆయనతో మాట్లాడేవాడిని. రాజకీయాల్లో మీరు లేని లోటు తెలుస్తోందని ఆయనతో చెప్పా. మిమ్మల్ని చూసి పెరిగానని, ఏవిధంగా అసెంబ్లీలో పోరాడారో.. రాజశేఖర్ రెడ్డి గారికి, చంద్రబాబు గారికి మధ్య యుద్ధం జరుగుతుందంటే ఒక్కమాటతో దానిని చల్లబరిచేవారు, అది మీ గొప్పతనం, రాజకీయాల్లో ఇప్పుడు లేకుండా పోయిందని చెప్పాను.

**పొట్టి శ్రీరాములు చరిత్రపై రీసెర్చ్ చేయాల్సిన అవసరం ఉంది..** రాష్ట్రం కోసం చాలా మంది పనిచేశారు. వారిని మనం గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ రోజు స్మృతివనం ద్వారా మనం కేవలం వీడియోస్, ఫోటోస్ మాత్రమే కాకుండా ఒక చైయిర్ కూడా ఏర్పాటుచేసి పొట్టి శ్రీరాములు గారు సమాజానికి ఏవిధంగా పనిచేశారో, దానిపై రీసెర్చ్ చేయాల్సిన అవసరం ఉంది. దానికి వేదికపై ఉన్న పెద్దల సహకారం కోరుతున్నా. ఇప్పుడు ప్రదర్శించిన వీడియోలో పెద్దగా ఫోటోలు లేవు. ఆయన ఫోటోలన్నీ సేకరించాలి. లైబ్రరీ నుంచి బుక్స్ తీసుకువచ్చి వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. స్మృతివనం నిర్మించడమే కాదు.. ఒక చైయిర్ ఏర్పాటుచేసి ఆయన చరిత్రపై రీసెర్చ్ కూడా చేయాల్సిన అవసరం ఉంది.

**విగ్రహం ఏర్పాటు కేవలం కమిట్ మెంట్ మాత్రమే కాదు.. నాకో ఎమోషన్!..** పాదయాత్ర చేస్తున్నప్పుడు అమరావతిలో పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటుచేయాలని ఆర్యవైశ్య సోదరులు కోరారు. అప్పుడే హామీ ఇవ్వడం జరిగింది. ఇది కమిట్ మెంట్ మాత్రమే కాదు.. ఇది నాకో ఎమోషన్. చేయాలనే తపన. పాదయాత్రలో మిమ్మల్ని కలిసిన తర్వాతనే ఆయన గురించి తెలుసుకున్నాను. అందుకే ఒక ఎమోషన్ తో మేం అందరం పనిచేస్తున్నాం. అన్నిరకాలుగా ట్రస్ట్ కు మేం సహకరిస్తాం, నిలబడతాం. కలిసికట్టుగా ముందుకు వెళ్లి ఎవరూ ఊహించనట్లుగా అద్భుతమైన స్మృతివనం ఏర్పాటుచేయాలని కోరుకుంటున్నాను. అమర్ రహే పొట్టి శ్రీరాములు గారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ మాట్లాడుతూ.. అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం ప్రతిష్టించాలని, ఆడిటోరియం నిర్మించాలని చంద్రబాబు గారిని, మంత్రి నారా లోకేష్ ను కోరిన వెంటనే అంగీకరించారు. ఆ బాధ్యతను మంత్రి నారాయణ గారు మీద వేసుకుని సీఆర్డీయే అధికారులతో మాట్లాడి స్థలం కేటాయించారు. వాసవీ కన్యాకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని కోరితే చంద్రబాబు గారిని ఒప్పించి, పెనుగొండ పంపించి పట్టువస్త్రాలు సమర్పించిన ఘనత ఎన్డీయే కూటమిది. పొట్టి శ్రీరాములు గారి కాంస్య విగ్రహం కోసం అమరావతి నడిబొడ్డున 6.8 ఎకరాల స్థలం కేటాయించారు. రాబోయే మార్చి 16న 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని మంత్రి నారా లోకేష్ గారితో ఆవిష్కరింపజేస్తామని మాట ఇస్తున్నా. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ... మంత్రి లోకేష్ గారు గేమ్ చేంజర్. పొట్టి శ్రీరాములు గారి విగ్రహాన్ని ఆవిష్కరించాలని రాకేష్ గారికి ఆలోచన రావడం గొప్ప విషయం. ఇందుకు ధన్యవాదాలు. మా టీజీవీ గ్రూప్ తరపున మొదటి విరాళం రూ.కోటి అందిస్తున్నాం. ఇతర ఏ సహకారం కావాలన్నా అందిస్తాం. గత ఎన్నికల్లో 95 శాతం మంది ఆర్యవైశ్యులు కూటమికి ఓటేశారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేనివిధంగా నాకు కూడా మంచి శాఖ కేటాయించి గుర్తింపు ఇచ్చారు. మంత్రి పి.నారాయణ మాట్లాడుతూ.. హరిజనుల కోసం పొట్టి శ్రీరాములు గారు ఉద్యమాలు చేశారు. 58 రోజుల పాటు నిరాహార దీక్ష ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేశారు. అలాంటి వ్యక్తికి విగ్రహం ఏర్పాటుచేయాలని లోకేష్ గారు సీఎం గారికి చెప్పగా వెంటనే ఆదేశాలు జారీ చేయడం జరిగింది. 6.8 ఎకరాలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకోవడం జరిగింది. 2026 మార్చి 16 నాటికి స్మృతివనం నిర్మాణం పూర్తిచేస్తామని చెబుతున్నారు. సీఆర్డీయే తరపున అన్ని విధాల సహకారం అందిస్తాం. అనంతరం పొట్టి శ్రీరాములు గారి వారసులు నలుగురిని స్టేజి పైకి ఆహ్వానించి మంత్రి లోకేష్ వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. శంకుస్థాపన కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంత్రి లోకేష్ కు రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ పొట్టి శ్రీరాములు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, టీజీ భరత్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రూ.కోటి విరాళం ప్రకటించిన మంత్రి టీజీ భరత్



**అమరావతి,కలంకౌంటర్ :** అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ నిర్మాణానికి టీజీవీ సంస్థల తరపున రూ.కోటి విరాళం ఇస్తున్నట్లు మంత్రి టీజీ భరత్ ప్రకటించారు. అమరావతిలో ఏపీ ప్రభుత్వం, పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సంయుక్తంగా 58 అడుగుల కాంస్య విగ్రహంతో పాటు ఆడిటోరియం, స్మృతివనం ఏర్పాటు చేయనున్నాయి. వీటి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి భరత్ ఈ విరాళం ప్రకటించారు.వీరితో పాటు ప్రకాష్ ఆర్ట్స్ వారు 50 లక్షల విరాళాన్ని చెక్కు రూపంలో లోకేష్ ద్వారా ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ కు అందజేశారు.

# సెప్టెంబర్ నెలాఖరకు నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లు పూర్తి అవ్వాలి

-మార్క్ ఫెడ్ అధికారులను, తోబాకో కంపెనీలను ఆదేశించిన వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో రైతులు పండించిన నల్లబర్లీ పొగాకు కొనుగోళ్లు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని, సెప్టెంబర్ నెలాఖరకు నల్ల బర్లీ పొగాకు కొనుగోళ్లు పూర్తి అవ్వాలని మార్క్ ఫెడ్ అధికారులను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. బుధవారం వెలగపూడి సచివాలయంలోని ఐదవ బ్లాక్ లో వ్యవసాయ శాఖ, అనుబంధ శాఖల ఉన్నతాధికారులతో పొగాకు, ప్రత్తి కొనుగోళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రైతు శ్రమ వృథా కాకుండా మార్కెట్‌లో సమయానికి పంట కొనుగోళ్లు జరిగేలా ప్రభుత్వ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. రైతు ప్రయోజనం దృష్టిలో పెట్టుకుని పారదర్శకంగా కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాణిజ్య కేంద్రాల్లో ఎటువంటి అవినీతి, ఇబ్బందులు చోటు చేసుకోకుండా ప్రత్యేక పర్యవేక్షణ బృందాలను నియమించామని, రైతు శ్రేయస్సే ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలో నల్లబర్లీ పొగాకును 80 మిలియన్ కిలోలు పండించటం జరిగిందని, ఇప్పటివరకు 22 కంపెనీలు 40 మిలియన్ కిలోలు కొన్నారని, అదే విధంగా 15 మిలియన్ కిలోలు ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 55 మిలియన్ కిలోలు కొనడంతో ఇంకా 20 మిలియన్ కిలోలు ప్రయివేట్ కంపెనీ వారు అత్యవసరంగా ఈ నెల చివరి లోగా కొనాలని ఆదేశించారు. మిగిలిన 5 కిలోలు మార్క్ ఫెడ్ కొనుగోలు చేస్తుందన్నారు. 2025-26 రబి సీజన్ లో నల్లబెర్లి పొగాకు ను ఎవరు పండించకూడదని ఇందుకోసం 740 జీవో విడుదల చేసామన్నారు. కంపెనీలతో ఎంఓయూలు చేసుకున్న రైతులు మాత్రమే తెల్ల బర్లీ పొగాకును పండించాలని అన్నారు. నల్ల బర్లీ పంటను వేయకుండా రైతులు శనగలు, మినుములు, పెసలు, జొన్నలు, మొక్కజొన్న వంటి పంటలను వేయాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.

**ఖరీఫ్ సీజన్లో పండించే ప్రత్తి కొనుగోలుపై సీసీఐ దృష్టి సారించాలి**

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో ప్రత్తి సాధారణ సాగు విస్తీర్ణం 5.28 లక్షల హెక్టార్లు కాగా 4.02 లక్షల హెక్టార్లలో పంట సాగు చేయబడిందని మరియు దాదాపు 7.12 లక్షల మెట్రిక్ టన్నుల ప్రత్తి దిగుబడి అంచనా వేశామన్నారు. ఖరీఫ్ సీజన్లో పండినటువంటి ప్రత్తి పంటను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) కనీస మద్దతు ధర కలిగేలా రైతుల వద్ద ప్రత్తిని కొనుగోలు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అక్టోబర్ 1 నాటికి సిసిఐ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఇందుకోసం తగిన చర్యలను చేయాలని అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com